www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 27 ఆగస్టు 2024
5
ఏలూరు



ఫిట్ ఇండియా ప్లెడ్జ్

ప్రజాశక్తి - ఏలూరు
నేషనల్ స్పోర్ట్స్ డే సందర్భంగా సోమవారం ఉదయం స్థానిక అల్లూరి సీతారామరాజు స్టేడియంలో ఫిట్ ఇండియా ప్లెడ్జ్ నిర్వహించామని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఫుట్‌బాల్ కోచ్ ఎమ్‌డి.సిరాజుద్దీన్, అథ్లెటిక్ కోచ్ జి.కృష్ణకుమారి, హ్యాండ్‌బాల్ కోచ్ ఆర్.మోహన రవికుమార్, స్కేటింగ్ కోచ్ ఎస్‌కె.ఖాసిం, స్విమింగ్ కోచ్ బి.గణేష్, బ్యాడ్మింటన్ కోచ్ కె.శివనాగు, ట్రైనర్లు, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ సిబ్బంది మొత్తం 200 మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.


ప్రతిజ్ఞ చేస్తున్న కోచ్‌లు, ట్రైనర్లు

ఏలూరులో వైసిపి ఖాళీ..!


నేడు టిడిపిలో చేరనున్న మేయర్ దంపతులు

అదేబాటలో బొద్దాని శ్రీనివాస్, మైబాబు మరో 30 మంది వైసిపి కార్పొరేటర్లు

ఇప్పటికే మాజీ మంత్రి ఆళ్ల నాని వైసిపికి గుడ్‌బై

మేయర్ దంపతుల చేరికపై టిడిపి నేతల్లో భిన్నాభిప్రాయాలు

ఏలూరు మేయర్ నూర్జహాన్‌ను మార్చాలంటూ నాయకుల్లో చర్చ



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి
ఏలూరు నియోజకవర్గంలో వైసిపి ఖాళీ అవుతోంది. ఇప్పటికే మాజీ మంత్రి ఆళ్ల నాని పార్టీ పదవులతోపాటు పార్టీ సభ్యత్వానికి సైతం రాజీనామా చేశారు. అంతకుముందే ఏలూరు నియోజకవర్గంలో ఆళ్ల నాని తర్వాత కీలక నేతలుగా పేరొందిన బొద్దాని శ్రీనివాస్, మంచెం మైబాబు వంటివారు పార్టీకి రాజీనామా చేశారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు రాకముందు, ఆ తర్వాత ఏలూరు మేయర్ షేక్ నూర్జహాన్, ఆమె భర్త పెదబాబు టిడిపికి అనుకూలురుగా మారారు. మేయర్ పదవిని కాపాడుకునేందుకు మేయర్ దంపతులు టిడిపి గూటికి చేరుతున్నారనే ప్రచారం పెద్దఎత్తున సాగింది. మేయర్ దంపతులతోపాటు ఇతర వైసిపి కీలక నేతలంతా టిడిపిలో చేరనున్నట్లు కొద్దికాలంగా ప్రచారం సాగుతునప్పటికీ జరగలేదు. అయితే ఈ నెల 27వ తేదీ మంగళవారం మేయర్ దంపతులతోపాటు, దాదాపు 30 నుంచి 35 మంది వైసిపి కార్పొరేటర్లు, వైసిపిలో కీలక నేతలుగా కొనసాగిన బొద్దాని శ్రీనివాస్, మంచెం మైబాబుతోపాటు మరికొంతమంది నాయకులు ముఖ్యమంతి చంద్రబాబాబు, మంత్రి లోకేష్ సమక్షంలో టిడిపిలో చేరేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. సోమవారం సాయంత్రం వైసిపి పదవులకు, ఆ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు మేయర్ నూర్జహాన్ పెదబాబు దంపతులు తమ రాజీనామా లేఖలను విడుదల చేశారు. అనంతరం విడుదల చేసిన ఒక ప్రకటనలో తాము వ్యక్తిగత కారణాల రీత్యా టిడిపిలో చేరుతున్నట్లు ఏలూరు మేయర్ షేక్ నూర్జహాన్, కోఆప్షన్ సభ్యులు ఎస్‌ఎంఆర్.పెదబాబు పేర్కొన్నారు. తమ భావనను ప్రజలు అర్థం చేసుకుంటారని అనుకుంటున్నామని, ఎప్పటిలానే ఏలూరు నగర ప్రజలందరికీ అందుబాటులో ఉంటూ చేయగలిగినంత సేవ చేస్తామని, నగర ప్రజలు ఎప్పటిలానే తమపై పేమాభిమానాలు చూపాలని కోరారు. ఏలూరు నియోజకవర్గంలోని కీలక నేతలంతా టిడిపిలో చేరడంతో వైసిపి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

మేయర్ దంపతుల చేరికపై టిడిపిలో భిన్నాభిప్రాయాలు

ఏలూరు మేయర్ నూర్జహాన్, పెదబాబు దంపతులు టిడిపిలో చేరికపై ఆ పార్టీలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మేయర్ దంపతులను పార్టీలో చేర్చుకోవడాన్ని చాలామంది టిడిపి నాయకులకు ఇష్టం లేదని తెలుస్తోంది. గడిచిన పదేళ్లలో జరిగిన విషయాలను వారు గుర్తు చేసుకుంటున్నారు. 2014లో టిడిపి ప్రభుత్వం అధికారంలోకొచ్చింది. ఏలూరు ఎంఎల్‌ఎగా బడేటి బుజ్జి గెలుపొందారు. ఆ తర్వాత ఏలూరు కార్పొరేషన్ ఎన్నికలు వచ్చాయి. మేయర్ అభ్యర్థిత్వంపై అంతా మల్లగుల్లాలు పడుతుండగా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకుంటూ రాజకీయాలతో సంబంధం లేని ఎస్‌ఎంఆర్.పెదబాబు భార్య నూర్జహాన్‌ను మేయర్ అభ్యర్థిగా బడేటి బుజ్జి నిర్ణయించారు. ఆ ఎన్నికల్లో టిడిపి అఖండ విజయం సాధించడంతో ఐదేళ్లు మేయర్‌గా నూర్జహాన్ పెదబాబు కొనసాగారు. 2019 అసెంబ్లీ ఎన్నికలకు కొద్దిరోజుల ముందు ఎంఎల్‌ఎ బడేటి బుజ్జికి, మేయర్ దంపతుల మధ్య బేధాభిప్రాయాలు ఏర్పడ్డాయి. దీంతో ఎన్నికల సమయంలో మేయర్ దంపతులు ఆళ్ల నాని సమక్షంలో వైసిపిలో చేరి నానికి ఎన్నికల్లో తమ వంతు సహకారం అందించారు. ఆ ఎన్నికల్లో బడేటి బుజ్జి 4,072 ఓట్ల తేడాతో ఓటమి చెందారు. కేవలం 2.52 శాతం ఓట్ల తేడాతో బుజ్జి ఓటమి పాలయ్యారు. మేయర్ దంపతులు వైసిపిలోకి వెళ్లి టిడిపికి అనుకూలమైన మైనార్టీ ఓట్లతోపాటు తమ అనుకూల ఓటర్లను వైసిపికి వేయించారని, అందువల్లే బుజ్జి స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి చెందారని అప్పట్లో టిడిపి నాయకుల్లో తీవ్ర చర్చసాగింది. 2019లో వైసిపి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లోనూ షేక్ నూర్జహాన్ పెదబాబు వైసిపి తరపున మేయర్ అభ్యర్థిగా పోటీ చేసి గెలిచి పదవి చేపట్టారు. 2024 ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి వచ్చింది. ఇప్పుడు మళ్లీ మేయర్ దంపతులు టిడిపిలోకి చేరేందుకు సిద్ధమయ్యారు. వైసిపి ప్రభుత్వ హాయాంలో ఏలూరులో తమను మేయర్ దంపతులు తీవ్ర ఇబ్బందులు పెట్టారని టిడిపి నాయకులు చెబుతున్నారు. అటువంటి వారిని పార్టీలోకి ఏవిధంగా చేర్చుకుంటారనే చర్చ టిడిపిలో విస్తృతంగా సాగుతోంది.

మేయర్‌ను మారిస్తే ఓకే..!

మేయర్ దంపతులను పార్టీలోకి చేర్చుకున్నప్పటికీ మేయర్‌గా మాత్రం వేరొకరిని నియమించాలని టిడిపి నాయకులు గట్టిగా పట్టుబడుతున్నట్లు తెలుస్తోంది. 50 మందికిగాను 35 మంది కార్పొరేటర్లు టిడిపిలో చేరితే మేయర్ పీఠం టిడిపి కైవసం అవుతోంది. మేయర్ నూర్జహాన్‌తో రాజీనామా చేయించి టిడిపిలో కష్టపడిన వారికి అవకాశం ఇవ్వాలని ఆ పార్టీ నాయకుల్లో చర్చ జరుగుతున్నట్లు తెలుస్తోంది. అవసరమైతే టిడిపి నాయకుల్లో ముఖ్యనేతను కోఆప్షన్ సభ్యునిగా నియమించి మేయర్ పదవి ఇవ్వాలనే ప్రచారం సాగుతోంది. ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి నిర్ణయాన్ని బట్టి మేయర్ మార్పు ఉంటుందని అంతా చెబుతున్నారు. ఆయన పాతవి మర్చిపోయి ముందుకు సాగుతారా.. లేక మేయర్ మార్పు చేస్తారా అనేది రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. మేయర్ దంపతుల చేరిక, పరిణామాలపై ఎంఎల్‌ఎ చంటి తీరుసైతం చర్చనీయాంశమవుతోంది.


నినదిస్తున్న నేతలు, మహిళలు

పంట ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

అధికారులు భూస్వాములకు తొత్తులుగా వ్యవహరించడం తగదు

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ

ప్రజాశక్తి - టి.నర్సాపురం
గిరిజనులు, దళితులు సాగు చేస్తున్న పంటను ధ్వంసం చేసిన భూస్వాములపై చట్టపరమైన చర్యలు చేపట్టి కఠినంగా శిక్షించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్ ముందు ఆ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం గిరిజనులపై దాడులు, పంట ధ్వంసంపై ఎఎస్‌ఐకి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ఐదేళ్లుగా మండలంలోని అబ్బుల్లాపురం, సాలిగూడెం తదితర గ్రామాల గిరిజనులు, దళితులు ఎర్రకాలువ రిజర్వాయర్ మిగులు భూములను సాగు చేసి వరి, మొక్కజొన్న వంటి పంటలు పండిస్తున్నారన్నారు. వీరంతా వ్యవసాయ, కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారని తెలిపారు. రెక్కాడితేగాని డొక్కాడని సుమారు 50కిపైగా కుటుంబాలు ఎర్రకాల్వ రిజర్వాయర్ మిగులు భూములను సాగు చేసుకుంటున్నాయని తెలిపారు. ఆ భూములపై స్థానిక భూస్వాముల కన్ను పడిందన్నారు. గిరిజన, దళిత మహిళలపై దాడి చేసి పంట పొలాల్లో ఆవులు, గేదెలను మేపి మొత్తం పంటను నాశనం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు భూస్వాములు గిరిజన, దళిత మహిళల పట్ల అసభ్యకరంగా మాట్లాడుతూ, కులం పేరుతో దూషిస్తూ మీ సంగతి తేలుస్తామంటూ మిమ్మల్ని చంపినా అడిగే దిక్కు లేదని దుర్భాషలాడటం దుర్మార్గమన్నారు. భూస్వాములపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కూలీలు సాగు చేసుకోవడానికి ఎకరాకు రూ.లక్షకుపైనే ఖర్చు చేసి సాగు చేసిన పంటను ధ్వంసం చేయడంతో ఆ కుటుంబాలు గడవడం కష్టదాయకంగా మారిందన్నారు. పంటను నాశనం చేసిన వారి నుండి ఒక్కో కుటుంబానికి రూ.లక్ష చొప్పున నష్టపరిహారం ఇప్పించాలని డిమాండ్ చేశారు. ఇరిగేషన్ అధికారులు రిజర్వాయర్ భూముల్లో సాగు చేసుకున్న పేదల పట్ల సానుకూలంగా వ్యవహరించకపోవడంతో భూస్వాములు ఇంతటి దుర్మార్గానికి ఒడిగట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు జోక్యం చేసుకుని చట్ట విరుద్ధంగా వ్యవహరించిన భూస్వాములపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పేదలు, దళితులు, గిరిజనులు సాగు చేసుకున్న పంట పొలాలు వారే సాగు చేసుకునేలా అవకాశం కల్పించాలని, ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి పేదలు, దళితులకు న్యాయం చేయాలని కోరారు. చట్టప్రకారం నిందితులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు అనమోలు మురళి, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు మడకం సుధారాణి, కుంజా చెల్లమ్మ, రామలక్ష్మి, దుర్గమ్మ, బేబీ తదితరులు పాల్గొన్నారు.

చోరీ సొత్తు కొనుగోలు చేయడం నేరం

జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్


ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్
దొంగతనాలకు పాల్పడటం ఎంత నేరమో, దొంగ సొమ్మును కొనుగోలు చేయడమూ నేరమేనని జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ అన్నారు. కాపర్ వైర్ చోరీ కేసులో కాపర్ వైర్ కొనుగోలు చేసిన వారిని కూడా నిందితులుగా చేర్చి కేసు నమోదు చేశామని, దొంగ సొత్తు కొనుగోలు చేసే వారికి ఇది ఒక హెచ్చరిక అని ఆయన అన్నారు. నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని మెట్ట ప్రాంతంలో విద్యుత్ ట్రాన్సఫార్మర్ల నుంచి రాగి వైరు చోరీకి గురవుతున్నట్లు బుట్టాయగూడెం పోలీస్ స్టేషన్లో పలు ఫిర్యాదులు అందాయన్నారు. దీనిపై బుట్టాయగూడెం పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి ఎస్‌ఐ దుర్గామహేశ్వరరావు నిందితుల కోసం గాలింపు చేపట్టారన్నారు. ఈ క్రమంలో చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారని, వారితోపాటు చోరీ సొత్తు కొనుగోలు చేసిన ఇద్దరిని కూడా గుర్తించి అరెస్టు చేసినట్లు తెలిపారు. వైరు చోరీ చేసిన వారికి రూ.పది నుంచి రూ.15 వేలు సొమ్ము మాత్రమే లభిస్తుందని, కోల్పోయిన రైతులకు మాత్రం రూ.రెండు లక్షల వరకు నష్టం వాటిల్లుతుందని ఆయన అన్నారు. ఈ కేసులో మొదటి నిందితునిగా ఉన్న గోపీకిరణ్ ఇప్పటి వరకూ 19 కేసుల్లో నిందితునిగా ఉన్నాడన్నారు. ఇక రెండో నిందితుడు జీలుగుమిల్లి ప్రాంతానికి చెందిన పోనుకుమాటి నరసింహారావుపై ఇప్పటి వరకు గోపాలపురం, నల్లజర్ల పోలీస్ స్టేషన్లో మూడు కేసుల్లో నిందితునిగా ఉన్నాడని తెలిపారు. మరో నిందితుడు జీలుగుమిల్లి ప్రాంతానికి చెందిన షేక్ హుస్సేన్ అని, వీరి నుంచి తెలంగాణ రాష్ట్రం అశ్వారావుపేట ప్రాంతానికి చెందిన తోట శ్రీనివాసరావు, విజయవాడ ప్రాంతానికి చెందిన సతీష్‌కుమార్ రాగి వైరు కొనుగోలు చేసినట్లు గుర్తించి అరెస్టు చేశామన్నారు. వీరందరినీ రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కేసులో వీరి వద్ద నుండి దాదాపు 400 కేజీల రాగి వైరు రికవరీ చేసామని తెలిపారు. ఇకపై జిల్లాలో చోరీలకు పాల్పడేవారితోపాటు చోరీ సొత్తు కొనుగోలు చేసే వారిపైనా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన జీలుగుమిల్లి సిఐ వెంకటేశ్వరరావు, బుట్టాయగూడెం ఎస్‌ఐ దుర్గామహేశ్వరరావుతోపాటు సిబ్బందిని ఎస్‌పి ప్రత్యేకంగా అభినందించారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి ప్రతాప్ శివకిషోర్

కృష్ణాష్టమి వేడుకల్లో మంత్రి, ఎంపీ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్
మండలంలోని రావి చర్ల గ్రామంలో మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ కాపా శ్రీనివాసరావు ఆధ్వర్యంలోయ శ్రీ ప్రబోధ సేవాసమితి ఆధ్వర్యంలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. పలు చిత్రాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారధి, ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రజలకు శ్రీ కృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ప్రజలందరి ఆర్థికాభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం నిత్యం పాటుపడుతుందన్నారు. మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ కాపా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం శ్రీ కృష్ణాష్టమి వేడుకలను ఆనవాయితీగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా మంత్రి, ఎంపీలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టిడిపి నేతలు కాపా మహేష్, ఎ.చందు, స్థానికులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: శ్రీకృష్ణాష్టమి సందర్భంగా ఆగిరిపల్లి వేణుగోపాలస్వామి ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో మంత్రి కొలుసు పార్థసారధి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఆయన తిలకించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


నూజివీడు: మంత్రి, ఎంపీలకు పుష్పగుచ్చాలు అందిస్తున్న నేతలు


ఎంఎల్‌ఎను సత్కరిస్తున్న అపుస్మా కార్యవర్గం

ఎంఎల్‌ఎను కలిసిన అపుస్మా నూతన కార్యవర్గం

ఎంఎల్‌ఎ బడేటి చంటి

ఏలూరు సిటీ: ఆంధ్రప్రదేశ్ ప్రయివేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్మెంట్స్ అసోసియేషన్ ఏలూరు నియోజకవర్గ నూతన కార్యవర్గం ఎంఎల్‌ఎ బడేటి చంటిని సోమవరం క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అపుస్మా నూతన కార్యావర్గాన్ని ఎంఎల్‌ఎ బడేటి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజహితమైన ప్రతి కార్యక్రమంలో తమ ప్రభుత్వం అండగా నిలుస్తుందని, ప్రభుత్వ పాఠశాలలకు పూరకంగా ఉన్న ప్రయివేట్ పాఠశాలలపై తమకి ఎనలేని గౌరవం ఉందని, ఎటువంటి సహాయమైనా చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జనరల్ సెక్రటరీ ఎమ్‌బిఎస్ శర్మ, రాష్ట్ర ఉపాధ్యక్షులు మార్గాని నాగ శ్రీకాంత్, ఏలూరు అధ్యక్షులు కె.వెంకటేశ్వర రావు, కార్యదర్శి సతీష్, కోశాధికారి శేఖర్, కార్యవర్గసభ్యులు అర్చన, పద్మజ, జిల్లా నాయకులు కె.విజయలక్ష్మి, ఏలూరు నాయకులు చంద్రశేఖర్, ప్రసాద్, రానా ప్రతాప్, ఉమాశంకర్, జయరాజు, తదితర నాయకులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

కామవరపుకోట: కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన ఏకీకృత పెన్షన్ స్కీమ్(యుపిఎస్)ని వ్యతిరేకిస్తున్నట్లు బహుజన టీచర్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు కస్సే శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి అబ్బదాసరి రఘునాథ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులను తప్పుదోవ పట్టించే ప్రయత్నంలో కేంద్ర ప్రభుత్వం కేవలం ఎన్‌పిఎస్ పేరును యుపిఎస్‌గా మార్చిందని తెలిపారు. పాత పెన్షన్ పథకానికి యుపిఎస్ ప్రత్యామ్నాయం కాదన్నారు. పాత పెన్షన్ పథకాన్ని పూర్తిగా పునరుద్ధరించాలని, పిఎఫ్ ఆర్‌డిఎని రద్దు చేయాలని, 10 శాతం జీతం తగ్గింపును నిలిపివేయాలని వారు డిమాండ్ చేశారు.

ఘనంగా మదర్ థెరిస్సా జయంతి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్
రెడ్‌క్రాస్ జిల్లా ఛైర్మన్ బివి.కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో భారతరత్న మదర్ థెరిసా 114వ జయంతి వేడుకను సోమవారం ఏలూరు రెడ్‌క్రాస్ సొసైటీ, అమ్మ స్వచ్ఛంద సేవాసమితి సంయుక్త ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తొలుత సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న మదర్ థెరిసా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాత శిశువిభాగంలో ఉన్న గర్భిణులకు, బాలింతలకు, పిల్లలకు రొట్టెలు, రస్కుల ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అమ్మ స్వచ్ఛంద సేవా సమితి అధ్యక్షుడు వివిఎన్‌వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రార్థించే పెదవులు కన్నా సహాయం చేసే చేతులు మిన్న అన్న నినాదంతో మదర్ థెరిసా ఎంతో మంది ప్రజలకు సేవలు అందించి, ప్రపంచానికి అమ్మగా పేరుగాంచారని అన్నారు. ఈరోజు మదర్ థెరిసా సేవా మార్గంలో అనేక స్వచ్ఛంద సేవా సంస్థలు పనిచేస్తున్నాయని, అందులో అమ్మ స్వచ్ఛంద సేవా సమితి ఒకటని తెలిపారు. మదర్ థెరిసాను ఆదర్శంగా తీసుకుని రెడ్‌క్రాస్ నర్సింగ్ విద్యార్థినీలు అందరూ సేవలు చేయాలని కోరారు. రెడ్‌క్రాస్ వాలంటీర్లు మాట్లాడుతూ విషజ్వరాలు, హెచ్‌ఐవి, కుష్టు, క్షయ వ్యాధి, మసూచి వంటి ప్రాణాంతకమైన వ్యాధులు ప్రబలించి బాధపడుతున్న ప్రజలకు మురికివాడలకు వద్దకు వెళ్లి మరీ సేవలందించిన గొప్ప మానవతామూర్తి మదర్ థెరిసా అన్నారు. 1982లో ఇజ్రాయిల్-పాలస్తీనా గెరిల్లాల పోరు మధ్య చిక్కుక్కున్న 37 మంది పిల్లలను రెడ్‌క్రాస్ వాలంటీర్లతో కలిసి థెరిసా కాపాడి వారికి వైద్య సేవలు అందించారని అన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ వాలంటీర్లు, కార్యదర్శి వి.విజయ నరసింహారావు, ఇళ్ల వరప్రసాద్, పాండురంగారావు, గోవిందరాజు, సుబ్రహ్మణ్యం, రెడ్‌క్రాస్ నర్సింగ్ విద్యార్థినీలు పాల్గొన్నారు.


బాలింతలకు రొట్టెలు, రస్కులు అందజేస్తున్న రెడ్‌క్రాస్ వాలంటీర్లు

తీజ్‌ను బంజారాల జాతీయ పండుగగా గుర్తించాలి

బంజారా బజరంగీ భేరి

ప్రజాశక్తి - టి.నరసాపురం
పాడిపంటలు, సిరి సంపదలకు సంకేతమే తీజ్ పండుగని, ఆ పండుగను జాతీయ పండుగగా ప్రభుత్వం గుర్తించాలని బంజారా బజరంగీ భేరి సంఘం నాయకులు కోరారు. లంబాడీ, తండాలు పాడి పంటలతో వెల్లివిరియాలని, గ్వార్ ప్రజలు సిరిసంపదలతో తులతూగాలని, బంజారా జాతి కీర్తిప్రతిష్టలతో వర్థిల్లాలని కోరుకుంటూ మండలంలోని కృష్ణాపురం గ్రామంలో తొమ్మిది రోజుల పాటు తీజ్ దీక్ష పూర్తి చేసుకున్న బంజారా ఆడబిడ్డలు సోమవారం తీజ్ ధర్మ దీక్షను విరమించారు. ఈ సందర్భంగా బంజారా బజరంగీ భేరి సంఘం ఆధ్వర్యంలో తీజ్ బుట్టలను తీన్మార్ డప్పులతో, బంజారా నృత్యాలతో ఊరంతా ఊరేగింపు చేసి తీజ్‌లను రాళ్ల చెరువులో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా బంజారా బజరంగీ భేరి జిల్లా నాయకులు భూక్యా నాగరాజు నాయక్ మాట్లాడుతూ బంజారా ప్రజలు తమ ఆడబిడ్డలను ఏడు భవానీల రూపంలో అపురూపంగా చూసుకుంటారని, చిన్నప్పటి నుంచి ధైర్యసాహసాలు నూరి పోస్తారని, ఎన్ని కష్టాలు వచ్చినా ఎదుర్కొనేలా సిద్ధం చేయడానికి తీజ్ పండుగను కన్యలైన ఆడపిల్లలతో చేయిస్తారని అన్నారు. సంఘం ప్రధాన కార్యదర్శి బి.వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఉన్న బంజారాలు తీజ్ పండుగను అంగరంగవైభవంగా చేసుకుంటారని, ఈ పండుగను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బంజారాల జాతీయ పండుగగా గుర్తించి, తీజ్ గుడులను నిర్మించుకోవడానికి ఆర్థిక సహాయ సహకారాలు అందించాలని డిమాండ్ చేశారు. సంఘ కోశాధికారి ధరావత్ రవి నాయక్ మాట్లాడుతూ బంజారాల సంస్కృతి, సాంప్రదాయాలు ప్రపంచంలోనే భిన్నమైనవని, ప్రకృతితో ముడిపడి, ప్రజల జీవన విధానాలను నడిపిస్తాయని, ఏ కాలానికి ఏ పంట అనుకూలమో తెలుసుకుని ఆ పంటలను వేసే శాస్త్రీయమైన పండుగ తీజ్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో భూక్యా బిగనాథం, ధరావత్ హంక్యా, శ్రీనివాస్ నాయక్, బంగారయ్య, బోడా విమలావతి, జరభల కృష్ణ, భద్రమ్మ, కృష్ణలీల, భూక్యా నాగమణి, భాగ్య, తల్లిదండ్రులు, గ్రామస్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.


తీజ్ పండుగలో గ్రామస్తులు

కార్తీక్ మృతికి కారకులను శిక్షించాలి

తండ్రి, లాయర్ పయనం రత్నరాజు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ
తన కుమారుడు పయనం కార్తీక్ మృతిచెందిన ఘటనలో కోడలు మనీషా ప్రియ, ఆమె తల్లిదండ్రులు, బంధువులు అంతేకాకుండా వేధింపులకు గురిచేసిన ఏలూరు పోలీసులు కారణమని తండ్రి లాయర్ పయనం రత్నరాజు ఆరోపించారు. లాయర్ గృహం వద్ద సోమవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లాయర్ రత్నరాజు మాట్లాడుతూ 2017వ సంవత్సరంలో తన కుమారుడు కార్తీక్‌కు హైదరాబాద్‌కు చెందిన మనీషా ప్రియతో ఏలూరులో ప్రేమ వివాహం జరిగిందన్నారు. ఏలూరులోనే వీరి కాపురం ఆరు సంవత్సరాలు జరిగిన తర్వాత మనీషా ప్రియ తల్లిదండ్రులు ఆమెను హైదరాబాద్ తీసుకెళ్లి మనసు మార్చారని ఆరోపించారు. సంవత్సరం కాలంగా తమ కుటుంబం మీద అక్రమ కేసులు బనాయించి, పోలీసులకు లంచాలు ఇచ్చి తమ కుటుంబాన్ని, కుమారుడిని వేధింపులకు గురిచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో పోలీసులు తమ కుటుంబాన్ని కూలీలుగా మార్చి ఎఫ్‌ఐఆర్‌లో నమోదు చేయడం పట్ల మనస్థాపన చెందామని పోలీసులు తీరు పట్ల విమర్శించారు. తమ కుటుంబంలోని సభ్యులంతా లాయర్లుగా హైకోర్టులో పనిచేస్తున్నామన్నారు. అటువంటి తమను పోలీసులు కూలీలుగా మార్చడం విడ్డూరంగా ఉందన్నారు. తాము మనిషాపైన, ఆమె తల్లిదండ్రులపైన కేసు పెట్టినప్పటికీ తమను పట్టించుకోకుండా తమ మీదే లేనిపోని కేసులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై రాష్ట్ర హోంమంత్రికి, రాష్ట్ర డిజిపికి, జిల్లా కలెక్టర్‌కి, అదేవిధంగా జిల్లా ఎస్‌పికి ఫిర్యాదు చేస్తామని తెలిపారు. తమపై అన్యాయంగా కేసులు పెట్టిన పోలీసులు, అదేవిధంగా కోడలు, ఆమె తల్లిదండ్రులపైన కేసులు నమోదు చేసి, వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. ఆవిధంగా తమ కుమారుడు చావుకు కారణమైన వారిని శిక్షిస్తేనే మాకు న్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే విషయంపై లాయర్ డానియేలు, మాజీ ఎస్‌సి కమిషన్ సభ్యులు కట్టెపోగు బసవరావు, వి.ఉదయ్ కుమార్, అదేవిధంగా రాజ్యలక్ష్మి అనే గృహిణి మాట్లాడుతూ లాయర్ రత్నరాజు కుటుంబ సభ్యులంతా ఎంతో కలిసిమెలిసి ఉండేవారని, ఈమధ్య ఎటువంటి సమస్యలూ లేకపోయినప్పటికీ పోలీసులు తప్పుడు కేసులు పెట్టి వేధిస్తున్నారని ఆరోపించారు. పయనం కార్తీక్ మృతికి కారకులను కఠినంగా శిక్షించాలని కోరారు.

అసాంఘిక కార్యకలాపాలపై చర్యలు

సిఐ ఎం.రవీంద్ర నాయక్



ప్రజాశక్తి - చింతలపూడి
చింతలపూడి సర్కిల్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా తగిన చర్యలు తీసుకుంటామని చింతలపూడి సిఐ ఎం.రవీంద్ర నాయక్ తెలిపారు. చింతలపూడి సర్కిల్ ఆఫీసు వద్ద సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చింతలపూడి మండలంలో పోక్స్ కేసులు ఎక్కువగా ఉన్నట్లు తెలిసిందని, వాటిపైన ప్రజలందరికీ అవగాహన కల్పిస్తామని తెలిపారు. ప్రజలందరికీ చక్కటి పరిపాలన అందించడం మా బాధ్యతని తెలిపారు. ప్రజలందరూ ఏ సమయంలోనైనా తమ సమస్యలను మాకు చెప్పుకోవచ్చు అని, పోలీస్ స్టేషన్‌కు రావచ్చని, లేదా సర్కిల్ ఆఫీస్‌కి రావచ్చు అని, ఫోన్ ద్వారా కూడా తమ ఫిర్యాదులు తెలియజేయవచ్చని తెలిపారు. 100 శాతం వారికి న్యాయం చేయడానికి కృషి చేస్తామన్నారు. ఎవరికీ భయపడనవసరం లేదని తెలిపారు. విజయవాడ నుంచి సాధారణ బదిలీలో భాగంగా చింతలపూడి వచ్చినట్టు తెలిపారు. గతంలో కరోనా సమయంలో మూడు నెలలు చింతలపూడిలో పనిచేసిన అనుభవం ఉందన్నారు. అంతకు ముందు కాకినాడ, ఏలూరు విజయవాడ పనిచేసినట్లు తెలిపారు. ప్రజలందరి మన్నలు పొందడానికి కచ్చితంగా కృషి చేస్తామని తెలిపారు.



కూలీలతో చెట్లు తొలగిస్తున్న పంచాయతీ అధికారులు

రోడ్డుకు అడ్డుగా ఉన్న చెట్లు తొలగింపు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లి(వయా) అన్నవరం, వడాలి ఆర్ అండ్ బి రహదారిలో పిచ్చిచెట్లు, ముళ్లకంపలు దట్టంగా పెరిగిపోయి ప్రజలు రాకపోకలు సాగించేందుకు అడ్డంకిగా మారాయి. రోడ్డుపైకి చెట్ల కొమ్మలు వ్యాపించడంతో ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు, ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. తరచూ పలుసార్లు ప్రమాదాలు జరుగుతూ ప్రజలు క్షతగాత్రులుగా మారుతున్నారు. చెట్ల కొమ్మలు రోడ్డుపైకి వ్యాపించడంతో వాహనదారులకు దారి కనిపించక ఇటు వాహనదారులు, అటు ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ సమస్యపై ప్రజాశక్తి దినపత్రికలో సోమవారం 'ప్రమాదాలకు నిలయం ఆ రోడ్డు' అనే శీర్షికతో వార్త వెలువడిన విషయం పాఠకులకు విధితమే. ఈ వార్తకు స్పందించిన ముదినేపల్లి గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో వెంటనే కూలీలను ఏర్పాటుచేసి రోడ్డుకు ఇరువైపులా రహదారిపై వ్యాపించి ఉన్న పిచ్చి మొక్కలను, ముండ్ల చెట్ల కొమ్మలను కూలీలచే కొట్టించి వేయించారు. దీంతో రహదారి ఎప్పటిలాగా విశాలంగా మారడంతో పాటు దారి కనబడకుండా అడ్డంకిగా ఉన్న చెట్ల కొమ్మలు తొలగించడంతో వాహనదారులు, పాదాచారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

విభిన్న ప్రతిభావంతుల నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - ఏలూరు

2024వ సంవత్సరం నుంచి ప్రారంభమయ్యే ఆంధ్రప్రదేశ్ విభిన్న ప్రతిభావంతుల ఎంప్లాయిస్ అసోసియేషన్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల నూతన కార్యవర్గం సోమవారం ఎన్నికైంది. అధ్యక్షులుగా చల్లా పార్థసారధి, జిల్లా ప్రధాన కార్యదర్శిగా విడుదల యుగంధర్, కోశాధికారిగా ఆసి బాబు ఎంపికైయ్యారు. ఉపాధ్యక్షులుగా జంగంశెట్టి ప్రసాద్, సంయుక్త కార్యదర్శిగా తణుకు రాము, అసోసియేట్ అధ్యక్షులుగా కె.దుర్గా, పి.పార్వతి వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాజపుట్ నాగేంద్ర సింగ్, డి.శ్రీకాంత్‌లు ఎంపికైయ్యారు. కార్యవర్గసభ్యులుగా జ్యోతి, వెంకటేశ్వరరావు, జగదీష్, రాంబాబు, కృష్ణమూర్తి, డేవిడ్, గంగాధర్, ఆనంద్ ఎంపికైనట్లు నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తెలిపారు. ఈ కార్యక్రమంలో లాం విద్యాసాగర్, మాదిరెడ్డి రాము, ఎపి ఎన్‌జిఒ నాయకులు చోడగిరి శ్రీనివాస్, శ్రీ హరినాథ్, ఆంధ్రప్రదేశ్ విభిన్న ప్రతిభావంతులు ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సతీష్, జిల్లాల నుంచి వచ్చిన విభిన్న ప్రతిభావంతులు పాల్గొన్నారు.

ఘనంగా 'హెల్పింగ్ హ్యాండ్స్' వార్షికోత్సవం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు ట్రిపుల్ ఐటీలో 'హెల్పింగ్ హాండ్స్' వారి 15వ వార్షికోత్సవం, మదర్ థెరిసా జన్మదినం సందర్భంగా మొక్కలు నాటారు. ముఖ్య అతిథులుగా నూజివీడు ట్రిపుల్ ఐటీ ఎఒ డాక్టర్ లక్ష్మణరావు భగవతి, ఎఫ్ఒ బి.శ్రీనాథ్, డీన్ ఆఫ్ అకడమిక్స్ ఎన్.రత్నాకర్ హాజరై మదర్ థెరిసా చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం హెల్పింగ్ హాండ్స్ వార్షికోత్సవంను కొత్తగా చేరిన ఎన్ 24 బ్యాచ్ విద్యార్థులకు వ్యాసరచన, ప్రసంగపు పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తమ సహాయార్థం హెల్పింగ్ హాండ్స్ చేస్తున్న సేవలను విద్యార్థులు ఎంతో మెచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో హెల్పింగ్ హాండ్స్ సంస్థ ప్రెసిడెంట్ ఎ.బ్రహ్మాస్వాములు, జనరల్ సెక్రటరీ జె.మధు, జాయింట్ సెక్రటరీలు, డాక్టర్ సలీంబాబు, డాక్టర్ వేణుగోపాల్, సీతాపతి, చిరంజీవి పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి మొక్కలు నాటిన సభ్యులు

నేరాలు - ఘోరాలు

ఎటిఎం దొంగల అరెస్టు

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లి వై జంక్షన్‌లో యాక్సిస్ బ్యాంక్ ఎటిఎంలో ఈనెల 15వ తేదీ అర్ధరాత్రి జరిగిన దొంగతనం కేసులో ఇద్దరి ముద్దాయిలను అరెస్టు చేసినట్లు ఎస్ఐ డి.వెంకట్ కుమార్ సోమవారం తెలిపారు. పోలీస్ స్టేషన్లో ఎస్ఐ వెంకట్ కుమార్ విలేకరులతో మాట్లాడారు. ముద్దాయిలైన బెండి రామకృష్ణ, బెండి లక్ష్మీనారాయణలను ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్, డిఎస్‌పి శ్రావణ్ కుమార్ ఆదేశాలతో సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి కైకలూరు రూరల్ సిఐ బి.కృష్ణ కుమార్ పర్యవేక్షణలో అరెస్ట్ చేశామన్నారు. ఈ కేసులో ముద్దాయిలైన రామకృష్ణ, లక్ష్మీనారాయణ సొంత అన్నదమ్ములని, వీరిది మండవల్లి మండలం పుట్లచెరువు గ్రామమన్నారు. ముద్దాయిల్లో చిన్నవాడైన రామకృష్ణ ఆన్‌లైన్ బెట్టింగులకు అలవాటు పడి సుమారు మూడు లక్షల వరకు అప్పులు చేయడం జరిగిందన్నారు. ఈ అప్పులు ఎలాగైనా తీర్చాలనే ఉద్దేశంతో హైదరాబాద్లో పెయింటింగ్ పనిచేస్తున్న రెండవ ముద్దాయి లక్ష్మీనారాయణకి ఫోన్ చేసి ముదినేపల్లి రప్పించినట్లు తెలిపారు. 15వ తేదీ తెల్లవారుజామున ఒంటిగంట ప్రాంతంలో రామకృష్ణ ఎటిఎం కరెంటు వైర్లు కట్ చేసి, ఎటిఎంలోకి ప్రవేశించి ఎటిఎంను ధ్వంసం చేశారన్నారు. దొంగతనం చేసే సమయంలో ఎటిఎంలో ఉన్న అల్లారం మోగి ఆ శబ్దానికి ముద్దాయిలు ఇద్దరూ అక్కడి నుంచి పారిపోయినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. బ్యాంక్ యాజమాన్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ముద్దాయిలు ఇద్దరిని అరెస్ట్ చేసి, కైకలూరు కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ వెంకట కుమార్ తెలిపారు. వారి వద్ద నుంచి నేరానికి ఉపయోగించిన సుత్తి, రాడు, కటింగ్ ప్లేయర్లు, తదితర సామాగ్రి స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఇసుక అక్రమ రవాణా : ట్రాక్టర్ సీజ్

ప్రజాశక్తి - టి.నరసాపురం

ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్ సీజ్ చేసినట్లు ఎస్ఐ ఎం.జయబాబు సోమవారం తెలిపారు. మండలంలోని గంగినీడుపాలెం శివారు ఎర్రకాల్వ నుంచి ట్రాక్టర్‌పై ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేసి, ఇసుక ట్రాక్టర్ సీజ్ చేసి, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

జోరుగా బుసక అక్రమ వ్యాపారం

ట్రాక్టర్లలో తరలింపు
చోద్యం చూస్తున్న అధికారులు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని పలు గ్రామాల్లో బుసక అక్రమ తవ్వకాలు జోరుగా జరుగుతున్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండా దర్జాగా బుసక తవ్వకాలు చేస్తూ, ట్రాక్టర్లతో బయటకు తరలిస్తూ భారీగా సొమ్ము చేసుకుంటున్నారు. ఈ తతాంగం అంతా అధికారులకు తెలిసినా చూసి చూడనట్లుగా వ్యవహరించడంపై ప్రజల నుంచి తీవ్ర విమర్శలు వెలువెత్తుతున్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు బుసక లోడుతో ట్రాక్టర్లు రై రై అంటూ మండల తహశీల్దార్ కార్యాలయం ఎదురుగా వెళ తున్నా పట్టించుకునే వారే లేకుండా పోయారు. అధికారులపై రాజకీయ నాయకుల ఒత్తిళ్లు ఒక కారణం కాగా, రెవెన్యూ యంత్రాంగంలోని కొంతమంది వ్యక్తులు మట్టి మాఫియా అడుగులకు మడుగులెత్తుతున్నారు. వీరికి మట్టిమాఫియా నుంచి హామ్యామ్యాలు అందడంతో చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. గ్రామాల్లో జరిగే మట్టిమాఫియా ఆగడాలు గూర్చి రెవెన్యూ యంత్రాంగానికి ఎవరైనా ఫిర్యాదు చేస్తే తమకు కనబడట్లేదు, వినపడట్లేదు అంటూ సమాధానం ఇస్తూ దాటవేస్తున్నారు. మండలంలోని చిగురుకోట, బొమ్మినంపాడు తదితర గరువు గ్రామాల నుంచి బుసక అక్రమ రవాణా భారీగా జరుగుతుంది. ట్రాక్టర్ ట్రక్కు బుసక రూ.2 వేల పైబడి ధర పలుకుతుంది. దీంతో మట్టిమాఫియా ఇష్టారాజ్యాంగా గరువు గ్రామాల్లో కాలువ గట్లు, చేలలోని దెబ్బలను తవ్వేస్తూ జోరుగా బుసక విక్రయాలు చేస్తూ, జేబుల్లో సొమ్ము నింపుకుంటున్నారు. ముఖ్యంగా సెలవు రోజుల్లో బుసక దందా మరింత ఎక్కువగా సాగుతుంది. గ్రామస్తులు ఎవరైనా ప్రశ్నిస్తే జగనన్న కాలనీల పూడికకు, రహదారి విస్తరణ పనులకంటూ సమాధానం చెబుతూ బుసక వ్యాపారం జోరుగా సాగిస్తున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ, మైనింగ్ శాఖల అధికారులు స్పందించి బుసక అక్రమ తవ్వకాలకు, అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.




బుసక తరలిస్తున్న ట్రాక్టర్లు

ఒపిఎస్ తప్ప మరే పెన్షన్ స్కీమ్ అంగీకరించం

యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి

ప్రజాశక్తి - భీమవరం

పాత పెన్షన్ స్కీమ్‌ను పునరుద్ధరించాల్సిన ప్రభుత్వం సిపిఎస్ రద్దు చేయకుండా యునిఫైడ్ పెన్షన్ స్కీమ్ (యుపిఎస్) తీసుకురావడం దారుణమని యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి అన్నారు. తక్షణం దేశమంతటా పాత పెన్షన్ స్కీమ్ (ఒపిఎస్) అమలుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని నిరసిస్తూ ఈ నెల 30న అన్ని తాలూకా కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు పెద్దసంఖ్యలో ఈ నిరసన ప్రదర్శనల్లో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సిపిఎస్ రద్దు చేయాలని, పాత పెన్షన్ పునరుద్ధరించాలని వివిధ రాష్ట్రాల్లో ఆందోళనలు సాగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఇలా యుపిఎస్‌ను ముందుకు తీసుకురావడం తీవ్ర ఆక్షేపణీయమని పేర్కొన్నారు. సిపిఎస్ కంటే మెరుగైనది యుపిఎస్ అంటూ కేంద్రం అంకెల గారడీ చేసిందని విమర్శించారు. ఉద్యోగుల, ఉపాధ్యాయుల వాటాతో సంబంధం లేకుండా అన్ని రకాల సదుపాయాలు ఉండే పాత పెన్షన్ కంటే మరేదీ అంగీకారం కాదని పేర్కొన్నారు. గత రాష్ట్ర ప్రభుత్వం 2022 ఏప్రిల్ 25న సిపిఎస్ స్థానంలో జిపిఎస్ తీసుకొచ్చిందని, దీనిని యుటియఫ్, ఇతర ఉపాధ్యాయ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకించాయని గుర్తు చేశారు. ప్రస్తుత ప్రభుత్వం జిపిఎస్ అమలుకు ముందుకొస్తే నిరసనలు వెల్లువెత్తడంతో తాత్కాలికంగా నిలుపుదల చేసిందని పేర్కొన్నారు. సిపిఎస్, జిపిఎస్, యుపిఎస్ ఏదైనా పెన్షన్ ఉద్యోగుల హక్కు, భిక్షకాదు అని చెప్పిన సుప్రీంకోర్టు తీర్పునకు భిన్నమైనవని విమర్శించారు. తక్షణం పాత పెన్షన్ విధానంకు చర్యలు తీసుకోవాలని కోరారు.



నవ దంపతులతో మంత్రి పార్థసారథి

నూతన దంపతులను ఆశీర్వదించిన మంత్రి

ముసునూరు: నూతన దంపతులను రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారథి ఆశీర్వదించారు. మండలంలోని కాట్రేనిపాడు గ్రామానికి చెందిన (రంగన్నపాలెం) రాపర్ల రామకృష్ణ దంపతులను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలియజేశారు.

జిల్లాలో 8,463 మెట్రిక్ టన్నుల ఇసుక సరఫరా

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో 3 బుకింగ్ సెంటర్ల ద్వారా రూ.3.88 లక్షల విలువైన 1,850 మెట్రిక్ టన్నుల ఇసుకను సరఫరా చేసినట్లు మైనింగ్ డిడి రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మూడు బుకింగ్ సెంటర్లలో 94 ఆర్డర్లు నమోదు కాగా అన్నింటికీ ఇసుక సరఫరా కాబడింది. 92 లారీలు, 2 ట్రాక్టర్ల ద్వారా ఇసుక సరఫరా చేయబడిందన్నారు. జిల్లాలో ఇంతవరకు మొత్తం 8,463 మెట్రిక్ టన్నుల ఇసుక వినియోగదారులకు సరఫరా చేయబడిందని పేర్కొన్నారు.

ఇబ్రహీంపేట స్టాక్ పాయింట్ వద్ద మెట్రిక్ టన్నుకు రూ.210, చేబ్రోలు స్టాక్ పాయింట్ వద్ద రూ.538, విజరం స్టాక్ పాయింట్ వద్ద టన్నుకు రూ.362కు ఇసుకను విక్రయదారులకు సరఫరా చేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం ఇక్కడ పెండింగ్ లేకుండా అందిన బుకింగ్ మేరకు ఇసుక వినియోగదారులకు సరఫరా చేయడమైనది. ఇసుక సరఫరాపై ర్యాండంగా 25 మంది వినియోగదారులకు ఫోన్‌చేయగా నూరు శాతం మంది సంతృప్తి వ్యక్తం చేశారన్నారు. గ్రీవెన్స్ పరిష్కార వేదికకు రెండు ఫిర్యాదులు అందగా ఆ ఫిర్యాదులను కూడా పరిష్కరించారని పేర్కొన్నారు.

హడలెత్తిస్తున్న గ్రామ సింహాలు

భయాందోళనలో గ్రామస్తులు
అధికారులు చర్యలు తీసుకోవాలని వేడుకోలు

ప్రజాశక్తి - కుక్కునూరు

మండలంలోని ప్రధాన రహదారిలో, జనాల మధ్య, గ్రామ వీధుల్లో ఎక్కడ చూసినా కుక్కలు గుంపులు గుంపులుగా కనిపిస్తున్నాయి. వాటిని చూసి గ్రామంలోని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ముఖ్యంగా పిల్లలు హడలిపోతున్నారు. ఇటీవల కాలంలో పిల్లలు, పెద్దలు తేడా లేకుండా దారిన పోయే వారిపై కుక్కలు దాడి చేసిన ఘటనలు అనేకం ఉన్నాయి. వాహన చోదకులు కూడా అనేకమార్లు కుక్కలు అడ్డురావడంతో ప్రమాదానికి గురైన సందర్భాలు ఉన్నాయి. ముఖ్యంగా పిల్లలు పాఠశాలలకు, అంగన్వాడీలకు వెళ్లాలంటే దారిలో కుక్కలను చూసి హడలిపోయి పరుగులు పెడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకొని, కుక్కల భారి నుంచి తమను కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.



రోడ్డుకు అడ్డంగా గుంపుగా ఉన్న కుక్కలు

నేటి నుంచి పవన్ కళ్యాణ్ జన్మదిన వారోత్సవాలు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా ఏలూరులో మంగళవారం నుంచి 7 రోజుల పాటు వారోత్సవాలు నిర్వహిస్తామని ఉభయగోదావరి జిల్లాల అధికార ప్రతినిధి, ఏలూరు నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి రెడ్డి అప్పలనాయుడు వెల్లడించారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 2వ తేదీన పవన్ కళ్యాణ్ పుట్టినరోజని చెప్పారు. ఈ నేపథ్యంలో వారం రోజుల పాటు ఆయన జన్మదిన వేడుకలను నిర్వహిస్తామని స్పష్టం చేశారు. పవన్ కళ్యాణ్ ఉద్దేశం కూడా సేవా కార్యక్రమాలు చేయడమని తెలిపారు. ఈ సేవా కార్యక్రమాల్లో భాగంగా ఒకరోజు బ్లైండ్ స్కూల్లో పిల్లలకు అన్నదాన కార్యక్రమం, రవితేజ ఎడ్యుకేషన్ స్కూల్లో అన్నదాన కార్యక్రమం, ప్రేమాలయంలో అన్నదాన కార్యక్రమం, తంగెళ్లమూడిలో ఉన్న మానసిక వికలాంగుల స్కూల్లో అన్నదాన కార్యక్రమం, 12 పంపుల సెంటర్‌లో ఉన్న స్కూల్‌లో మొక్కలు నాటే కార్యక్రమం, కస్తూరిబా స్కూల్లో విద్యార్థులకు కాంపిటీషన్స్ పెట్టి విజేతలకు బహుమతులు అందజేయడం, గవర్నమెంట్ హాస్పిటల్‌లో పేషెంట్లకు పండ్లు పంపిణీ చేయడం, అనేక రకాల సేవా కార్యక్రమాలు చేస్తున్నామని తెలిపారు. 2వ తేదీ పార్టీ కార్యాలయంలోనే భారీ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశామని, అనంతరం 12 పంపుల సెంటర్‌లో 3 వేల మందికి అన్నదాన కార్యక్రమాన్ని, సాయంత్రం 4 గంటలకు చొదిమెళ్లలో జనసేన స్థూపం ఆవిష్కరణ కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రతి ఒక్క జనసేన నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు, జనసైనికులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయవలసిందిగా కోరుతున్నామని తెలిపారు. మీడియా సమావేశంలో మాజీ డిప్యూటీ మేయర్ శిరిపల్లి ప్రసాద్, జిల్లా సంయుక్త కార్యదర్శి ఓబిలిశెట్టి శ్రావణ్ కుమార్ గుప్తా, నగర ప్రధాన కార్యదర్శి సరిది రాజేష్ పాల్గొన్నారు.

చెరువుల ఆక్రమణ

స్పందించని అధికారులు
ఆందోళనలో రైతన్నలు

ప్రజాశక్తి - చింతలపూడి

చెరువులు ఆక్రమణకు గురవుతుంటే అధికారులు ఎందుకు పట్టించుకోవడంలేదని రైతులు ప్రశ్నిస్తున్నారు. రాను రాను చెరువులు కనుమరుగైపోతున్నాయని, ఈ చెరువు ఆక్రమణలు అధికారులు పట్టించుకోకపోతే తర్వాత తరాలకు గతంలో చెరువులు ఉండేవి అని చెప్పుకునే పరిస్థితులు వస్తాయని, రైతులు వాపోతున్నారు. రైతులు చెరువు నమ్ముకుని వ్యవసాయం చేస్తుంటారు. చెరువులో పుడికలు తీయడం వల్ల రైతులకు రబీ, ఖరీఫ్ పంటలకు సాగునీరు చెరువు అందిస్తున్నాయని రైతులు చెబుతున్నారు.

రాను రాను ఒక్కొక్క చెరువును ఆక్రమదారులు కొంచెం కొంచెం ఆక్రమించుకుంటూ చెరువులను కనుమరుగు చేస్తున్నారు. ఎన్ని ఫిర్యాదులు చేసినా అధికారులు పట్టించుకోకపోవడంతో చెరువులు మొత్తం ఆక్రమణకు గురైపోతున్నాయి. చెరువులో కూడా భవన నిర్మాణాలు జరుగుతున్నాయని ఆరోపణలు, జరిగాయని కొందరు చెబుతున్నారు. ఇవన్నీ అధికారులకు తెలియకుండా జరుగుతున్నాయా అని రైతులు ప్రశ్నిస్తున్నారు. చెరువులను పరిరక్షించవలసిన అధికారులు పట్టించుకోకపోవడం వల్ల ఆక్రమదారులు స్వేచ్ఛగా చెరువులు కబ్జా చేసి, వారికి ఇస్తానుసారంగా మార్చుకుంటున్నారని చెబుతున్నారు.

చింతలపూడి నగర పంచాయితీ పరిధిలో 21 చెరువులున్నాయి. అవి పెద్ద చెరువు, మొహిద్దీన్ కుంట, మాదిగ చెరువు, పేరంరాజు కుంట, మాదాపు కుంట, రాళ్లకుంట, బోయగూడెం పెద్ద చెరువు, వేగిలింగేశ్వరా స్వామి చెరువు, కోమటి కుంట, విభూతి కుంట, రంగన్న కుంట, శింగరాజు కుంట, రావుల కుంట, కృష్ణ రాయుడు కుంట, రామి కుంట, తాడిబందం చెరువు, కోపులకుంట, కముజుల బంధం చెరువు, కొత్త చెరువు, ఈడీగాడి చెరువు, అయ్యగారి కుంట ఇందులో 3 కుంటలు పూర్తిగా మాయమయ్యాయి. చింతలపూడి పెద్ద చెరువు, బోయగూడెం పెద్ద చెరువు, వేగి లింగేశ్వర స్వామి చెరువు ఆక్రమించబడి బిల్డింగులు కట్టబడ్డాయని ఆరోపణలు గట్టిగానే వినిపిస్తున్నాయి. ఇంకా భవన నిర్మాణాలు జరుగుతున్నాయని, మిగిలిన చెరువులు సైతం ఆక్రమించబడి సాగు భూములుగా మారుతున్నాయి. కావున ఆర్ఎస్ఆర్ ప్రకారం 21 చెరువుల విస్తీర్ణం సర్వే చేయించి, సరిహద్దులను గుర్తించి ఆక్రమణలను తొలగింపుకు అధికారులకు ఆదేశాలివ్వించవలసిందిగా రైతులు కోరుతున్నారు. చెరువుల కుంటల సంరక్షణ వల్ల చెరువుల కుంటలలో నీరు నిల్వ ఉండటంతో పాటు భూగర్భ జల ప్రమాణాలు పడి పోకుండా ఉంటాయని, వేసవిలో పశు పక్ష్యాదులకు తాగునీరు లభిస్తుందని అన్నారు. అంతేకాక వరద నష్టాల నుంచి భూతాపం, వడ గాడ్పుల నుంచి ప్రజలు చల్ల గాలులతో సేద తీరుతారని, పర్యావరణ ప్రాముఖ్యత రీత్యా భవిష్యత్తు తరాల కోసం సుప్రీంకోర్టు తీర్పు మేరకు చెరువులు కుంటలను సంరక్షించవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని చెబుతున్నారు. చెరువుల కుంటల సంరక్షణా చర్యలు తీసుకోవాల్సిందిగా, అధికారాలతో ఒక టాస్క్‌ఫోర్స్ సంస్థను ఏర్పాటు చేయవలసిందిగా ఉన్నతాధికారులను రైతులు కోరుతున్నారు.





చెరువులు కనుమరుగవుతున్నాయి

ఎం.వసంతరావు, సిపిఐ

రైతులకు సాగు చేయడానికి చెరువులు ఎంతగానో ఉపయోగపడతాయి. చెరువులు ఆక్రమణ గురవుతుంటే అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదో తెలియటం లేదు. చెరువులు ఆక్రమించి భవనాలు నిర్మిస్తున్నారు, అయినా అధికారులలో చలనం లేదు. మండలంలో కూడా కొన్ని చెరువులు పూర్తిగా ఆక్రమణకు గురైపోయాయి. చెరువులు ఆక్రమణకు గురవుతుంటే అధికారులు చోద్యం చూస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చెరువుల ఆక్రమణ తొలగించకపోతే, రాను రాను చెరువులు కనుమరుగై, రైతులకు వ్యవసాయం చేయడానికి కష్టమవుతుంది.

IN THE COURT OF THE PRINCIPAL CIVIL JUDGE ::
(SENIOR DIVISION) :: KOVVUR
Creditos' I.P.No. 15 of 2024

Between:
M/s. Shriram Finance Limited,
(Formerly known as Shriram Transport Finance Company Ltd.,)
Jangareddigudem Branch, Rep.by its Special Power of Attorney Holder & Asst. Business Manager Mr. Rajasekhar, G., Eluru ....Petitioner

And

1) Srilakshmi Uda, W/o. Uda Satish Khanna, Age 33 yrs, female, Business, R/.o.H.No.4-24, Jonnavarigudem, Tadavai Sivaru, Jangareddigudem (M), Eluru dist.
2) Kodali Swarajyalakshmi, W/o. Sambasiva Rao, Age 65 yrs Female, House wife, R/o. Lakshmipuram, Ayyavari Polavaram (P), Jeelugumilli (M), Eluru dist.
3) The Official Receiver, West Godavari Dist., District Court Complex, Eluru, Eluru Dist. ...Respondents

1వ రెస్పాండెంట్, పిటీషనరు రాజమహేంద్రవరం సోల్ అర్బిట్రేటర్ వద్ద వేసిన ఎ.సి.నెం.192/2024 దర్మిలా అవార్డు పొందిన బాకీ ఎగవేయు ఉద్దేశ్యంతో తన తాలూకు ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని 2వ రెస్పాండెంట్ పేరున ది.13-3-2024వ తేదీన జంగారెడ్డిగూడెం సబ్ రిజిస్ట్రార్ వారి ఆఫీసులో డాక్యుమెంట్ నెం.7253/2024రు గా సేల్ డీడ్ దస్తావేజును రిజిష్టరీ చేయించినారు. సదరు విషయం తెలియవచ్చి పిటీషనరు రెస్పాండెంట్లపై పై కోర్టులో పై నెంబరు క్రెడిటార్ ఐ.పి. దాఖలు చేసి 1వ రెస్పాండెంట్‌ను ఇన్‌సాల్వెంట్‌గా గుర్తించి, 1వ రెస్పాండెంటు 2వ రెస్పాండెంటు పేరున రిజిష్టరీ చేసిన సేల్ డీడ్ దస్తావేజును రద్దుపరచమని ఐ.పి. దాఖలు చేసి ఐ.పి. దాఖలా 'ఎ' షెడ్యూలు అనగా ఈ దిగువ షెడ్యూలు ఆస్థిని 3వ రెస్పాండెంటు కస్టడీ లోనికి తీసుకుని మేనేజ్ చేయించి పిటీషనరు బాకీ వసూలు ఇప్పించమని కోరియున్నారు. ఇందుపై ఎవరికైనా, ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల సదరు ఐ.పి. వాయిదా ది.**12-09-2024వ** తేదీన ఉదయం గం.10.30 ని॥లకు పై కోర్టు వారి సమక్షమున హాజరై ఆక్షేపణలు తెలియజేసుకోవలెను. లేని యెడల పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలంగా యావన్మందికి తెలియపర్చడమైనది.

షెడ్యూలు: ఏలూరు జిల్లా, జంగారెడ్డిగూడెం మండలం, జంగారెడ్డిగూడెం యస్.ఆర్.ఓ. లిమిట్స్, తాడువాయి గ్రామ పంచాయతీ, తాడువాయి విలేజ్, జిరాయితీ మెర్క ఆర్.యస్.నెం.301-1బి, చ.గ.173-33లు ఖాళీ స్థలమునకు హద్దులు కొలతలు:-
తూర్పు: అ 26-0 లు 5 అడుగుల వెడల్పు గల రోడ్డు **దక్షిణం:** అ 60-0 లు ఉప్పులూరి రామారావు గారి స్థలము **పడమర:** అ 26-0 లు నెల్లూరి వీర రంగారావు గారు ఇతరులకు క్రియపర్చిన స్థలము **ఉత్తరం:** అ 60-0 లు కదలి సత్యనారాయణ గారి స్థలము

మేడూరి వి.యస్.కె. శ్రీనివాస్, అడ్వకేట్,
కొవ్వూరు, తూ.గో.జిల్లా.
సెల్: 97051 97335
కొవ్వూరు
ది.26-08-2024



మత్స్యశాఖ సమీక్షలో మాట్లాడుతున్న ఎంపీ

కోళ్ల వ్యర్థాలు వాడితే కఠిన చర్యలు

మత్స్యశాఖ సమీక్షలో ఎంపీ పుట్టా మహేష్ కుమార్ హెచ్చరిక

ఏలూరు: జిల్లాలో చేపల చెరువుల్లో కోళ్ల వ్యర్థాలు వాడితే కఠిన చర్యలు తీసుకోవాలని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ మత్స్యశాఖ అధికారులను ఆదేశించారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్, ఎస్‌పిలకు తగు ఆదేశాలు ఇస్తామన్నారు. ఏలూరులోని మత్స్యశాఖ కార్యాలయంలో జరిగిన సమీక్షా సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ కొల్లేరు, గోదావరి చేపలకు జాతీయ స్థాయిలో మంచి మార్కెట్ ఉందని, కానీ ఇటీవల కాలంలో ఢిల్లీలో జరిగిన పలు సమావేశాల్లో కొల్లేరు చేపల పెంపకందార్లు కోళ్ల వ్యర్థాలు వాడుతున్నారని, అందువల్ల ఆరోగ్యం పాడైపోతుందనే అందోళన వ్యక్తమైందన్నారు. కొల్లేరు బ్రాండ్ ఇమేజ్‌ని ఎవరైనా దెబ్బతీయాలని చూస్తే సహించేది లేదన్నారు. మత్స్యశాఖ సమీక్షా సమావేశంలో డిప్యూటీ డైరెక్టర్ నాగలింగాచారి, అసిస్టెంట్ డైరెక్టర్(బాదంపూడి) నరసయ్య, అసిస్టెంట్ డైరెక్టర్(ఏలూరు) రాజకుమార్, మత్స్యశాఖ అభివృద్ధి అధికారి దివ్య పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణాష్టమి

ముసునూరు: శ్రీకృష్ణాష్టమి వేడుకలు మండలంలోని 16 గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. సోమవారం ఉదయం నుంచి ఆయా గ్రామాల్లోని దేవాలయాల్లో హిందూ పూజలు నిర్వహించి, శ్రీకృష్ణుడికి అభిషేకాలు, కార్యక్రమాలు చేపట్టి, ఉట్టి కొట్టడం, ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఆయా ఆలయ గ్రామ కమిటీ పెద్దలు, పెద్దఎత్తున మహిళలు, పలువురు పాల్గొన్నారు.

పేరు మార్పు ప్రకటన

గుండుగొల్లు చంద్రశేఖర్ (కొత్తపేరు) తండ్రి : గుండుగొల్లు మహంకాళి, తల్లి : గుండుగొల్లు మీరమ్మ, భార్య : గుండుగొల్లు మార్త, డోర్‌నెం.15-9, పెదపేట చర్చి దగ్గర, ఉండి, ఉండి మండలం, పశ్చిమ గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్ నందు నివశించుచున్నాను. ఇప్పుడు నా పేరును గుండుగోలును చంద్రశేఖర్ (పాతపేరు) తండ్రి గుండుగోలును మహంకాళి, తల్లి : గుండుగోలును మీరమ్మ, భార్య : గుండుగోలును మార్త నుండి గుండుగొల్లు చంద్రశేఖర్ (కొత్తపేరు) తండ్రి గుండుగొల్లు మహంకాళి, తల్లి : మీరమ్మ, భార్య : గుండుగొల్లు మార్త గా మార్చుకున్నాను. ఈ రోజు నుండి తదుపరి అన్ని లావాదేవీల కోసం నా కోసం నా కొత్త పేరును ఉపయోగించవలెను.

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం ఫస్ట్ ఆడిషనల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
ఓ.యస్.నెం.590/2022

బిట్వీన్:
బొడ్డు పద్మరాజు, S/o.ధర్మరాజు. హిందూ, పు. 39 సం.రం.లు, వ్యాపారం, 12వ వార్డు, తాడేపల్లిగూడెం,టిపిజి/పిజెసిజె ...వాది
మరియు
కరెడీ శామ్యూల్ జెమ్మి దైవ వరం, S/o. శామ్యూల్ జాన్, హిందూ, పు, 63 సం.లు, వ్యాపారం, డోర్ నెం.4-47-16, 7వ వార్డు, పి & టి కాలనీ, తాడేపల్లిగూడెం, ప.గో.జిల్లా, టిపిజి/పిజెసిజె. ...ప్రతివాది

పై నెంబరు గ్రంథములో పిటీషనర్ /వాది గారు శ్రీ కోర్టు వారి ద్వారా మిమ్ములను శ్రీ కోర్టు వారి ఎదుట హాజరు కావాలని పలుమార్లు కోర్టు వారి ద్వారా నోటీసులు పంపినప్పటికీ మీరు కోర్టు నోటీసులు తీసుకొనకుండా ఉద్దేశ్యపూర్వకంగా కాల యాపన చేయుచున్నారనిన్నీ. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం ది. 19-09-2024వ తేదీ గురువారం వాటికి వాయిదా వేసినారు. మీరు ఆ రోజు ఉదయం గం.10.30 ని॥ల లగాయితు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గానీ, మీ వకీలు గారి ద్వారా గానీ హాజరు అయి మీ యొక్క అక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల పై పిటీషన్ మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
తాడేపల్లిగూడెం, **జి.వి.ద్వారకానాథ్**
తేది.28-08-2024 డి.హెచ్.ఆర్ తరపు న్యాయవాది.

ప్రకటన
మహారాజశ్రీ నర్సాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
E.P.116/2006 in O.S.253/2005

DHR : కర్రి శ్రీను కుమారి
Vs
JDR's : బొండా మేరీరత్నం (Died) వగైరా
To.
2వ JDR :
B.Harshita Mounica, D/o.Bonda Mary Ratnam, W/o.Rajesh Babu, D.No.9-99/A, Kunchevari Street, Gummuluru, Poduru Mandal.

పై నెంబరు EP లో మీకు ఎన్నిపర్యాయములు నోటీసులు పంపినప్పటికిన్నీ మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. అందువల్ల ఈ ప్రకటన ద్వారా సదరు E.P లోని నోటీసులు అమలు జరపటమైనది. కాబట్టి ది.4-9-2024 తేది. ఉ.10.30 ని॥లకు పై కోర్టులో మీరు హాజరై మీ యొక్క వాదనను దాఖలు చేసుకొవలెను. లేని యడల మీకు పరోక్షముగా తీర్పు చెప్పబడును.

By Order of Court
గునిశెట్టి శ్రీనివాసరావు
నర్సాపురం అద్వకేటు, నర్సాపురం.
తేది.26-8-2024 సెల్: 9553126234